విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 10, సెప్టెంబర్ 2024

అపశృతులకు తావివ్వకుండా గణేష్ నిమజ్జనం చేపట్టండి : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం: అపశృతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ వి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాన్ని(హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ) జిల్లా ఎస్పీ సందర్శించారు. గణేష్ ప్రతిమలను కాలువ నీటిలో నిమజ్జనం చేయడాన్ని పర్యవేక్షించడంతో పాటు స్వయంగా ఆయన నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎస్పీ, ఎస్సైలకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం ప్రాంతాల్లో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. నిమజ్జన ప్రక్రియకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఎస్పీ వి.జగదీష్ వెంట అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, తదితరులు వెళ్లారు.

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోండి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఉప తహశీల్దార్ ఆంజనేయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ తాడిపత్రి పక్కనే ఉన్న పెన్నా నది పరివాహక ప్రాంతంలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు యజమానులు విచ్చలవిడిగా కొత్త బ్రిడ్జి నుండి పాత బ్రిడ్జి వరకు అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. కొత్త బ్రిడ్జి నుండి పాత బ్రిడ్జి వరకు రజకులు మురికి బట్టలు ఆరా వేసుకోవడానికి అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, ఎమ్మెల్యే జేసీ దివాకర్ రెడ్డి ఈ ప్రాంతాన్ని రజకులకు కేటాయించారు. కొంత మంది ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు యజమానులు ఆ ప్రాంతంలో ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. దీంతో ఇసుకను రవాణా చేయడంవల్ల గుంతలు ఏర్పడి వర్షం వచ్చినప్పుడు నీరు నిల్వ ఉంటుందన్నారు. చిన్న పిల్లలు నదిలోకి వెళ్లి ఆ గుంతల్లో దిగి చనిపోయే ప్రమాదం ఉందని, అంతేకాకుండా రజకులకు మురికి బట్టలు ఆరవేసుకోవడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. కొత్త బ్రిడ్జి నుండి పాత బ్రిడ్జి వరకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు ఇసుక రవాణా చేయకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రజకులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజనేయులు ఏఐటీయూసీ నాయకులు ఉమా గౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు గురుస్వామి మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: నియోజకవర్గ సీపీఐ రాయదుర్గం సహాయ కార్యదర్శి గురుస్వామి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప అన్నారు. సోమవారం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు తిరుపాల్, సీపీఐ రాయదుర్గం నియోజకవర్గ నాయకులు దురగప్ప తదితరులతో కలిసి గురుస్వామి మృతదేహానికి మాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప మాట్లాడుతూ గురుస్వామి ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చి కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షితులై తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కార్యకర్తగా నాయకుడిగా సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎదిగారన్నారు. పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవ చేశారన్నారు. పట్టణంలో పార్టీ ప్రజా సంఘాలు నిర్మాణానికి తనవంతు కృషి చేశారన్నారు. ప్రజా సమస్యల కోసం పార్టీ చేపట్టిన అనేక పోరాటాల్లో పాలుపంచుకున్నారని తెలిపారు. వరద బాధితులకు విరాళాల సేకరణలో పాల్గొని, ప్రజల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారన్నరు. ఆయన మృతి పార్టీకి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఎం నాగరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల యూనియన్ చేయూత

విశాలాంధ్ర-అనంతపురం: వరద బాధితులను ఆదుకోవడానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపుమేరకు జిల్లాల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విరాళాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అనంత మహిళా ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళా ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు హమీద్ భాను, అస్మిత్ భాను వరద బాధితుల సహాయార్థం రూ.4 వేల నగదు, 25 కేజీల బియ్యం ప్యాకెట్‌ను ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున సమక్షంలో జిల్లా సీపీఐ కార్యదర్శి జాఫర్‌కు అందజేశారు. జాఫర్ మాట్లాడుతూ వరద బాధితులకు సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరాళాలు సేకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తహీనత నివారణకు చర్యలు

విశాలాంధ్ర-రాప్తాడు: గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరత్న సూచించారు. రాప్తాడులోని అంగన్వాడీ రెండో సెంటర్లో సోమవారం రక్తహీనతపై గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత, హిమోగ్లోబిన్‌పై ర్యాలీ చేసి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, ఎనీమియా సంబంధిత ఆరోగ్యం లోపం ఉన్న వారి ఆరోగ్యం పట్ల అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో గర్భిణులు, బాలింతులు, చిన్నపిల్లలు రక్తహీనత లోపంతో మృతి చెందే అవకాశం లేకుండా వైద్య సిబ్బంది ద్వారా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య, అంగన్వాడీ సిబ్బంది గర్భిణీ, బాలింతల వివరాలు పూర్తిస్థాయిలో వారి ఆరోగ్య పరిస్థితిపై పరిశీలిస్తూ పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆహారాన్ని గర్భిణీ, బాలింతలు పూర్తిస్థాయిలో వినియోగించుకొనేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ 2 హేమలత, అంగన్వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ముత్యాలమ్మ, ఆయా సుశీల తదితరులు ఉన్నారు.

అవినీతికి పాల్పడిన ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని యల్లనూరు రోడ్‌లో ఉన్న ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద సోమవారము ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ ఆర్.శ్రీనివాసులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఉద్యోగి రైతుల భూములను ఆన్లైన్ ఎక్కించడంలో ఒకరివి, ఇంకొకరికి ఎక్కించి అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆ ఉద్యోగి పేద దళిత కుటుంబాలకు చెందిన భూములకు లంచాలు తీసుకొని అగ్రకులస్థుల వారికి ఆన్‌లైన్‌లో నమోదు చేశాడన్నారు. ఈ విషయంపై ఈ నెల 2న ఆ ఉద్యోగి 2019 నుండి ఇప్పటివరకు ఆన్లైన్లో ముటేషన్‌చేసి పాస్ బుక్కులు మంజూరు చేసిన వివరాలను ఇవ్వాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటివరకు తహశీల్దార్ కార్యాలయం వారు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఆ ఉద్యోగి చేసిన అవినీతి అక్రమాలపై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, కర్నూలు సీబీఐ అధికారుల, హైకోర్టు దృష్టికి తీసుకవెళ్లి పేద రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాటం చేస్తామని. ఎమ్మార్పీఎస్ నాయకులు డి.చంద్ర శేఖర్, సింగవరం కుల్లాయప్ప, నాగేంద్ర, జూటూరు రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ నెల 14 నుంచి విధులు బహిష్కరిస్తాం..

విశాలాంధ్ర-ఉరవకొండ: 9 నెలలుగా తమకు రావలసిన పెండింగ్ జీతాలు, 25 నెలలకు సంబంధించి ఈపీఎస్ రికవరీ చేసిన మొత్తాలను ఈనెల 13వ తేదీ లోపు చెల్లించకపోతే 14వ తేదీ నుంచి విధులను బహిష్కరించి సమ్మెకు వెళ్తామని ఉరవకొండ ఆర్డబ్ల్యూఎస్ స్కీంలో పని చేస్తున్న తాగునీటి సరఫరా కార్మికులు అన్నారు. సోమవారం ఉరవకొండ తాహశీల్దార్‌కు, ఆర్డబ్ల్యూఎస్ డీఈకి కార్మికులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నప్పటికీ తమకు కనీస వేతనం, నెల నెలా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ కట్టలేదని తెలిపారు. పెరిగిన నిత్యవసర ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు న్యాయం చేయాలని, కార్మికులందరూ అద్దె ఇల్లులో నివసిస్తున్నారని పిల్లల చదువులు, కరెంటు బిల్లుల చెల్లింపులు తదితర అనేక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నామని జిల్లా ఉన్నత స్థాయి అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, రాజశేఖర్, సాదిక్, శ్రీనివాసులు, ఉమాపతి, పెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను రద్దు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-అనంతపురం: విశాఖ ఉక్కు పరిశ్రమను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప యాదవ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో కార్మిక, రైతు జిల్లా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం అడ్డదారిలో చేస్తున్న ప్రైవేటీకరణను నిలుపుదలచేయాలన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఉక్కు పరిశ్రమ పరిస్థితి చాలా దయనీయంగా మారిందన్నారు. ఉత్పత్తి సామర్థ్యం తగ్గించి మరింత నష్టాల్లోకి నెట్టివేస్తున్నారన్నారు. కార్పోరేట్ కంపెనీలకు ఉక్కు పరిశ్రమను దారాదత్తం చేస్తూ వేలాది మంది కార్మికులను రోడ్డుపాలు చేయడమే బిజెపి లక్ష్యమన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా జరగబోయే రాస్తారోకోలను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్,నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షులు చిరంజీవి,రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నారెడ్డి,జిల్లా నాయకులు మధు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎస్డీసీలు శిరీష, కరుణ కుమారి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 315 అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎలాంటి పెండింగ్ లేకుండా గడువులోగా సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి అలసత్వం ఉండరాదని, అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీపీవో ప్రభాకర్ రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల్ రెడ్డి, డీఎంహెచ్ఓ డా.ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ పాల్ డా.రవికుమార్, సీపీఓ అశోక్ కుమార్, ఎల్డీఎం నర్సింగరావు, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజారావు, డీటీసీ వీర్రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాష పాల్గొన్నారు.

సరిత మృతికి కారకులైన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: సరిత మృతికి కారకు లైన వ్యక్తిని కఠినంగా శిక్షిం చాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాయదుర్గం తాలూకా కార్యదర్శి పార్వతి డిమాండ్ చేశారు. సోమ వారం విలేకరుల సమావేశంలో నిర్వ హించారు. కళాశాలకు బయలు దేరిన బోయ సరిత మరుసటి రోజున వడ్డేపల్లి టోల్ ప్లాజా అడవి పరిసర ప్రాంతాల్లో విగత జీవిగా పడి ఉండడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేపిందన్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా, ఆనాటి రిషితేశ్వరునికి మొదలుకొని నేడు బోయ సరిత వరకు ప్రేమించలేదని ఒకడు, మాట్లాడలేదని ఒకడు, నన్ను పెళ్లి చేసుకోవాలని ఒకడు, విద్యార్థినిలను పలు చోట్ల లైంగికంగా వేధిస్తు న్నాడన్నారు. మహిళలు, చిన్నపిల్లలు ఎంతమందో వీరిలో మానవ మృగాలకు బలైనారన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థిని కుటుం బానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యార్థిని మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు పిలుపునిస్తామన్నారు.

జిందాల్ సహాయంతో కాలువ పూడికతీత



విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామశివారులో కాలవ పూడిక పోవడంతో జిందాల్ సావ్ ఫ్యాక్టరీ సహాయంతో సోమవారం కాల్వపూడిక పనులు నిర్వహించారు. కాల్వ పూర్తిగా పూడిక పోవడంతో పొలాల నుండి వర్షం నీరు బయటకు పోయేందుకు ఇబ్బందిగా ఉండటంపై రైతులు విన్నపం మేరకు జిందాల్ సావ్ ఫ్యాక్టరీ యాజమాన్యం జేసీబీ పెట్టి సుమారు మూడు కిలోమీటర్ల కాల్వ పూడికతీత పనులు చేసి, వృత్తానీరు గ్రామంలోకి రాకుండా వేదావతి హగరివైపు మళ్ళించారు. గ్రామ సర్పంచ్ గాదిలింగ పనులను ముందుండి చేయించారు. గ్రామ సర్పంచ్ గాదిలింగ సహకారంతోని ఫ్యాక్టరీ యజమాన్యం పూడికతీత పనులు చేయించారని రైతులు అభినందించారు.

మానవత్వం చాటుకున్న హెడ్‌కానిస్టేబుల్

విశాలాంధ్ర-శింగనమల: మండలంలో మతిస్థిమితం లేక తిక్క పట్టి ఆకలితో అలమటిస్తున్న ఓ అభాగ్యుడికి శింగనమల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జింకల బాష ఆకలి తీర్చారు. శింగనమల మండల కేంద్రంలో మతిస్థిమితం లేక తిరుగుతున్న అతన్ని చూసి హెడ్ కాని స్టేబుల్ జింకల బాష చలించిపోయారు. దగ్గ రున్న హోటల్లో ఆహారం, నీళ్లు తెచ్చిచ్చి అత నికి ఆకలి తీర్చారు. ఓ పోలీస్ చేసే పనులు గమనించి బస్టాండ్‌లో చూసిన ప్రజలందరూ ప్రశంసల జల్లులు కురిపించారు.

వరద బాధితులకు సప్తగిరి క్యాంపర్ చేయూత

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: వరద బాధితులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. వరద బాధితులకు స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో లోలూరు వద్దనున్న సప్తగిరి క్యాంపర్ వైస్ ప్రెసిడెంట్ ఎండి.హనీఫ్ రూ.5 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా సప్తగిరి క్యాంపర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు వరద బాధితులకు సహాయార్థం రూ.5 లక్షలు అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సప్తగిరి క్యాంపర్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ హనీఫ్ మాట్లాడుతూ సప్తగిరి క్యాంపర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు మహేష్ రెడ్డి, శిల్పారెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో గత 20 రోజులుగా విజయవాడ, కృష్ణా, గోదావరి పరిసర ప్రాంతాల్లో పెను తుఫాను ప్రభావంతో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు.

13వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి

విశాలాంధ్ర- అనంత పురం: వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వ హించే ప్రభుత్వ కార్య క్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో బదిలీలు, ఆల్ ఇండియా రేడియోలో చేపట్టబోయే కార్యక్రమాలు, విజయవాడ వరద సహాయక చర్యలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, తదితర అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో ఈనెల 13లోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాలని, ఇందులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఖచ్చితంగా ఎవరెవరిని బదిలీ చేయాలనే జాబితా తయారు చేయాలని, వెయిటింగ్ ఫర్ పోస్టింగ్స్ ఉంటే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఖాళీల వివరాలు కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. జిల్లా అధికారుల స్థాయిలో జరిగే బదిలీలు పూర్తి చేయాలని, ఎలాంటి సందేహం ఉన్న డీఆర్ఓని, జిల్లా కలెక్టర్ ని సంప్రదించాలన్నారు. విజయవాడ వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి 182 మంది అధికారులు, సిబ్బందిని కేటాయించగా, పూర్తిస్థాయిలో వారు అక్కడికి వెంటనే వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: విజయవాడ ప్రాంత వరద బాధితుల కోసం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పెద్ద ఎత్తున సహాయ సహకారాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అనంతపురం నుంచి భారీ ఎత్తున కూరగాయలు విజయవాడకు పంపించారు. 30 టన్నుల టమోటా, 30 టన్నుల ఇతర కూరగాయలను సేకరించి వాటిని విజయవాడకు పంపించారు. ఈ వాహ నాలను ఇవాళ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో వరద బాధితులకు అండగా నిలిచేందుకు తమ బృందం వెళ్లిందని, రేపటి నుంచి అక్కడ వారు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. ముఖ్యంగా నిత్యవసరాలు బెడ్ షీట్స్ వంటివి స్థానికంగానే కొనుగోలు చేసి అక్కడ బాధితులకు అందజేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. తాను ముఖ్యమంత్రిని కలిసి వరద బాధితులకు సహాయంగా చెక్కు అందించబోతున్నట్లు దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు. నగరంలో ప్రతి వ్యాపారి సాయం అందించడానికి ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు గంగారామ్, రాయలసీమ బలిజ సంఘ యువజన జిల్లా అధ్యక్షుడు తొండపునాటి రమేష్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, కురువ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి కాశీ విశ్వనాథ్, టీడీపీ నాయకులు ధరూర్ ఓబుల నాయుడు, కడియాల కొండన్న, భక్తవత్సలం నాయుడు, రాజప్ప, కరుణాకర్ నాయుడు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-కూడేరు: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సోమవారం ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి మాస్ కలెక్షన్ చేశారు. ఈ కలెక్షన్‌లో వసూలైన మొత్తం రూ.10,528 మొత్తాన్ని విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సి.జాఫర్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాలూకా కార్యదర్శి జె.మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి.రమణ, సీపీఐ కూడేరు సీనియర్ నాయకులు ముట్టాల శ్రీరాములు, టి.రమణప్ప, ఏపీ రైతు సంఘం తాలూకా నాయకులు మంచినీళ్ల వరప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా నాయకులు మాలరాయుడు పాల్గొన్నారు.

వినాయక ఘాట్ పనుల పరిశీలన

విశాలాంధ్ర-గుత్తి: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి మండలం టీడీపీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ గుత్తి మున్సిపాలిటీ పరిధిలో తుర్కపల్లి రోడ్ వద్ద గల గణనాథుల నిమజ్జన ఘాట్ వద్ద స్థలాన్ని పరిశీలించి, భక్తులకు ఎలాంటి సమస్యలను ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను, ఘాట్ సభ్యులకు సూచించారు. అనంతరం గుత్తి పట్టణంలో గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అండగా నిలిచిన యూనివర్సిటీ ఉద్యోగులు

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతి విశ్వవిద్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగ పని చేస్తున్న శివరామిరెడ్డి భార్య నాగలక్ష్మి అకాల మృతి చెందింది. ఈ సందర్భందా ప్రగాడ సానుభూతి తెలుపుతూ యూనివర్సిటీ నుంచి రూ.15 వేలు రిజిస్ట్రార్ అందజేశారు. అనంతరం జేఎన్టీయూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అసోసియేషన్ కుటుంబ సభ్యులకు రూ.36.666 చెక్కును ఇన్చార్జ్ వీసీ ఆచార్య హెచ్.సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య చెక్కును శివరామిరెడ్డికి అందజేశారు.

జేవీవీ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం పద్మావతమ్మను కలిసి 17 రాష్ట్ర మహాసభల సభ్యత్వ నమోదు, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వాణి, రఘునాథ్ రెడ్డి, స్థానిక జేవీవీ నాయకులు మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రంగన్న, వెంకటరామిరెడ్డి గురు శంకర్ రామాంజనేయులు, రంగనాథ్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో రైతులకు ప్రత్యామ్నాయంగా అందిస్తున్న ఉలవల విత్తనాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శుభకర్ తెలిపారు. సోమవారం షేక్షాన్ పల్లి గ్రామంలో రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ నెల 11న స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఈ నెల 11న స్కూల్ గేమ్స్ పోటీలను ఉరవకొండలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, రమాదేవి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయి పోటీలలో అండర్ 14, అండర్ 17 బాల, బాలికలకు విడివిడిగా నిర్వహిస్తారన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అట్లాటిక్స్, చెస్, బాడ్మింటన్ క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీలల్లో నియోజకవర్గ స్థాయి పోటీలను ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించి, విజేతలను ప్రకటించడం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల పరిధిలోని గోవిందవాడ, ఉద్దేహాళ్, దేవగిరి, బండూరు, బొమ్మనహాళ్, గోనెహాళ్, శ్రీధరగట్ట తదితర గ్రామాల్లో సోమవారం వినాయకుల నిమజ్జనం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గత మూడు రోజుల నుంచి వినాయకునికి వివిధ రకరకాలైన పిండి వంటకాలతో నైవేద్యములు సమర్పించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నబీరసూల్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాగునీటి సలహా మండలి ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: సాగునీటి సలహా మండలి వార్షిక సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగష్టులోనే సమావేశం నిర్వహించాల్సి ఉండగా నిర్వహించలేదన్నారు. రైతులు ఏ పంటలను సాగు చేసుకోవాలి, ప్రాజెక్టుల్లో ఎంత నీరు లభ్యమవుతుంది, ఎంతవరకు నీటి విడుదలకు అవకాశం ఉంటుందన్న అంశాలను రైతులకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఐఏబీ సమావేశాన్ని నిర్వహించి రైతులలో ఉన్న అపోహలను తొలగించాలన్నారు.

గర్భిణీ స్త్రీలుకు ఆరోగ్య అంశాలపై అవగాహన

విశాలాంధ్ర-ఉరవకొండ: మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యాధికారి వెంకటేశ్ నాయక్ పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య విషయాల గురించి అవగాహన కల్పించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 10, సెప్టెంబర్ 2024

గుంజీలతో నిరసన తెలిపిన కార్మికులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవపురం వద్ద గల సత్యసాయి పంప్ హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి కార్మికులు 19వ రోజు సమ్మెలో భాగంగా తమ నిరసనగా గుజ్జులు తీస్తూ నిరసనను తెలిపారు. అనంతరం తాగునీటి కార్మికులు మాట్లాడుతూ రోజులు గడుస్తున్న యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు బాధని వ్యక్తం చేశారు. గత ఏడు నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఫీజులు ప్రశ్నార్థకమ య్యాయని, ఎలా జీవించాలో అయోమయ పరిస్థితిలో ఉన్నామని వారు బాధని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, జీతాలను వెంటనే చెల్లించేలా తగు చర్యలను వేగవంతంగా చేపట్టాలని కార్మికులు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - అగళి: ఇంటర్ చదువుతున్న బాలికకు వివాహం జరపాలని నిర్ణయించుకున్న పెద్దలకు అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని పి.బ్యాడిగేరా గ్రామానికి చెందిన మహాలక్ష్మి ఇంటర్ చదువుతోంది. బాల్య వివాహం చట్టరీత్య నేరమని ఐసీడీఎస్ సూపర్వైజర్ లీలావతి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండాకే వివాహాలు చేయాలని సూచించారు. స్థానిక గుప్తా కళాశాలలో మహాలక్ష్మి ఇంటర్ చదువుతుంది. మహాలక్ష్మి తండ్రి లేకపోవడంతో తల్లితోనే పెరుగుతుంది. తన మేనమామతో పెళ్లి చేయడానికి పెద్దలు నిర్ణయించడంతో 1098 ద్వారా సమాచారం ఇవ్వడంతో ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు తోపాటు ఐసీడీఎస్ సూపర్వైజర్ లీలావతి, సచివాలయ సిబ్బంది మహాలక్ష్మి, ఇంటికి వెళ్లి పెద్దలతో మాట్లాడి వివాహాన్ని నిలుపుదల చేయించారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి మున్సిపల్ అధికారులతో మాట్లాడి, రెండు పెద్ద క్రేన్లను ఏర్పాటు చేయించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, వీధుల్లో పోలీసుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదని ఏర్పాట్లను చేయించారు. పోలీసు శాఖ అధికారులతో పాటు వైద్య, విద్యుత్తు, ఇంకా వివిధ శాఖల అధికారులను నిమజ్జనం సందర్భంగా ఏ చిన్న సమస్య తలెత్తకుండా మంత్రి అప్రమత్తం చేశారు. మంత్రిగారి కార్యాలయ సిబ్బంది పట్టణంలో విగ్రహాల ఊరేగింపు దగ్గర నుండి చెరువు వద్ద నిమజ్జనం చేసే వరకు దగ్గర ఉండి ప్రజలు ఇబ్బందులు పడ కుండా నిరంతరం పర్యవేక్షించారు. ఆ ప్రాంతంలో తలెత్తిన సమస్యలను వెంటనే సంబంధిత శాఖ అధికా రులతో మాట్లాడి పరిష్కరించి, భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువు సమీపంలో జేసీబీలతో శుభ్రం చేయించడంతో పాటు, క్రేన్లను ఏర్పాటు చేసినందుకు పట్టణంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్న మంత్రికి ధర్మవరం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ ప్రాంతంలో వరద సహాయక చర్యల్లో పాల్గొంటూ తీరిక లేకుండా ఉన్నప్పటికీ మంత్రి ధర్మవరం ప్రజల కోసం సౌక ర్యాలను కల్పించడంపట్ల ప్రజలు ఆయనకు ధన్య వాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు డోలా రాజారెడ్డి, డి.చెర్లోపల్లి నారాయణ స్వామి, ఎస్పీ రత్న, వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, డీఎస్పీ టి.శ్రీనివాసులు, వైద్య నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-పుట్టపర్తి: రాయదుర్గం సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గురు స్వామి మృతి పార్టీకి తీరనిలోటని జిల్లా పార్టీ కార్యదర్శి వేమయ్య యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుస్వామి ఓ సాధారణ కుటుంబం నుండి వచ్చి కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షితులై పార్టీలో చేరాడన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కార్యకర్తగా నాయకుడిగా సీపీఐ నియోజకవర్గ సహాయకార్యదర్శిగా ఎదిగాడన్నారు. పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవ చేశాడన్నారు. రాయదుర్గం పట్టణంలో పార్టీ, ప్రజా సంఘాలు నిర్మాణానికి తనవంతు కృషి చేశాడన్నారు. ప్రజాసమస్యల కోసం పార్టీ చేపట్టిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. మృతి చెందడానికి ముందు వరకు వరద బాధితులకు విరాళాల సేకరణలో పాల్గొని, ప్రజల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నాడన్నారు. గురుస్వామి మృతి పార్టీకి వారి కుటుంబానికి తీరని లోటని, ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ, వారి కుటుంమబానికి సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన రామాంజనేయులు, భార్య నాగరత్నములు ఆదివారం రాత్రి ఓ పనిమీద ద్విచక్ర వాహనంలో అనంతపురానికి వెళుతుండగా, బత్తలపల్లి మండలంలోని బత్తలపల్లి పోలీస్ స్టేషన్ దాటగానే కొద్ది దూరంలో హైవే రోడ్డు వద్ద అతివేగంగా వెళుతూ స్పీడ్ బ్రేకర్లను గమనించకుండా వెళ్లారు. దీంతో అకస్మాత్తుగా టూవీలర్ ఎగరడంతో వెనకాల కూర్చున్న భార్య నాగ రత్నమ్మ ఒక్కసారిగా ఎగిరిపడి తనకు తీవ్రమైన గాయమైంది. గమ నించిన వాహనదారులు బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రికి చేర్పించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. భార్యా, భర్తలు చాకలి వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగించే వారిని, వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అరుణాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ నుండి ఈనెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదర్శన కాణిపాకం గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం ఈనెల 17న ఉదయం 6 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోయి, రావడానికి చార్జీలు రూ.1400 ఉంటుందన్నారు. దర్శనానికి వెళ్లవలసిన భక్తాదులు ఆన్‌లైన్‌లోను, బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లోను సీట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 6303151302, 9959225859లను సంప్రదించాలని తెలిపారు.

రహదారిని పరిశీలించిన నాయకులు

విశాలాంధ్ర-రొద్దం: స్థానిక పంచాయతీ పరిధి కందుకూరు పల్లి రహదారి నిర్మాణం కోసం రాష్ట్ర బీసీ సంక్షేమ జోలి శాఖ మంత్రి సవితమ్మ తర్వాత రహదారి నిర్మాణం కోసం రూ.62 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించడంతో రహదారిని స్థానిక టీడీపీ నాయకులు మాధవ నాయుడు, చంద్రమౌళి, చిన్నప్పయ్య, అశ్వత్ నారాయణ, యు.నర్సింలు, చంద్రశేఖర్, అక్బర్ చెన్నకేశవులు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కందుకూరు పల్లి గ్రామస్తులైన హను మన్న, వెంకటప్ప, హనుమంతు రాయుడు, కులాయప్ప, గోవింద్ రెడ్డి, అరువప్ప తదితర గ్రామస్తులు తమ 30 ఏళ్ల నాటికలను మంత్రి దేశం నాయకులు నెరవేస్తున్నందు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.

వీధిదీపాలు ఏర్పాటు చేసిన సర్పంచ్

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని ముతకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కురుబరలపల్లి ముత్తుకూరు తాండ, వద్ర హట్టి, మద్దన కుంట గ్రామాలలో విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో వీధి దీపాలు వెలగక గ్రామాల్లో అంధకారం నెల కొనడంతో ప్రజల ఇబ్బందులను గమనించి అవసరమైన చోట కొత్త విద్యుత్ దీపాలను అమర్చామని తెలిపారు.

వరద బాధితులను ఆదుకుందాం

విశాలాంధ్ర-పెనుకొండ: విజయవాడలో సంభవించిన ప్రకృతి సంబంధమైన వరదల కారణంగా లక్షలాది మంది నిరాశ్రయులై అన్న పానాలు కరువై అలమటిస్తున్నారు. ఈ నేపథ్యంలో సేవా తత్పరుల తోపాటు, పెనుకొండ శ్రీసత్యసాయి సేవాదళ సభ్యులందరూ ఇంటింటా తిరిగి ధాన్యం, నిత్యవసర వస్తువులు సేకరించారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి గ్రామ పంచాయతీ లోని యగ్ని శెట్టిపల్లి గ్రామంలో సోమవారం డాక్టర్ తేజస్విని ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను, ప్రజా నిధులను సమావేశపరిచి పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్యం అందించేందుకు ప్రజలకు ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థి తులు తెలుసుకొని వైద్యం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు మంజునాథ స్వామి, గోపీనాథ్ స్వామి, రంగస్వామి, సత్యనారాయణ, రమేష్, గంగాధర్, మల్లి కార్జున, వేణుగోపాల్, శివ, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బహుజన చైతన్య వేదిక బృందం

విశాలాంధ్ర-పెనుకొండ: పుట్టపర్తిలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ రత్నని మర్యాదా పూర్వకంగా బహుజన చైతన్య వేదిక బృందం సభ్యులు కలిశారు. బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, గౌరవ అధ్యక్షులు వెంకటేష్ నాగరాజు, పడేటి రాందాస్ కలసి, ఎస్పీతో జిల్లాలోని పలు బహుజనుల సమస్యలపై చర్చించామని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

ఘనంగా గణేశుని నిమజ్జనం

విశాలాంధ్ర-గోరంట్ల: వినాయక చవితి పండుగ సందర్భంగా మూడో రోజు అయిన సోమవారం గణేష్ విగ్రహాలు నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడి విగ్రహాలను ప్రత్యేక వాహ నాలలో ఏర్పాటు చేసుకొని పిల్లలు యువకులు రంగులు చల్లుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. సీఐ బోయ శేఖర్ బూదిలి రోడ్డులోని ఎర్ర చెరువులో విగ్రహాల నిమజ్జ నానికి ఏర్పాటు చేయించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ చౌడేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూను వేలం వేసి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని అవినకుంట, బీజీ హళ్లి, డీటీ హళ్లి గ్రామల్లో కొలువుదీరిన వినాయకునికి సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. భక్తులు వివిధ రకాల తినుబండారాలు గణేశునికి నైవేద్యంగా సమర్పించి మూడు రోజులు విశేష పూజ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిమజ్జనానికి గ్రామాల పురవీధుల గుండా డబ్బు వాయిద్యాలతో ఉత్సాహంగా సాగుతూ వైభవంగా గణనాథున్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

చేనేత ఉత్పత్తుల అమ్మకాల ప్రదర్శన

విశాలాంధ్ర-ధర్మవరం: చేనేత, సిల్క్ ఉత్పత్తులను, అమ్మకాలను ప్రోత్సహించడానికి చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీలలో విజయవాడలోని ఎంజీ రోడ్డులోని శ్రీ శేష సాయి కళ్యాణ వేదిక యందు, బయ్యర్ షెల్టర్ మీట్ నిర్వహిస్తున్నారని హ్యాండ్లూమ్స్ ఏడీ రమేష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి చేనేత, సిల్క్ సహకార సంఘాలు, మాస్టర్ వీవర్లు, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. వస్త్ర వ్యాపారులు, మాల్స్ షోరూమ్ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, బయ్యర్ షెల్టర్ను సందర్శించి, ధర్మవరం పట్టుచీరలతో పాటు ఇతర చేనేత సిల్క్ ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలపి వారు కోరారు.

ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడలు

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదా నం నందు క్రీడలను ఈ నెల 12,13 తేదీల్లో నిర్వహించాలని సమావేశంలో ఎంఈఓ గోపాల్ నాయక్, మండల కోఆర్డినేటర్ పీడీ రఘునాథ్, నియోజకవర్గ కోఆర్డి నేటర్ నాగేంద్ర తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈఎఫ్‌జీ ఎఫ్‌ఐ గేమ్‌లో వాలీబాల్, ఖోఖో, కబడి, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లలో బాలురు, బాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో నిర్వహిస్తారని మండల కోఆర్డినేటర్ పీడీ రఘునాథ్, నియోజవర్గ కోఆర్డినేటర్ నాగేంద్ర తెలిపారు. పీటీలు లక్ష్మీనారాయణ, సరళ తదితరులు పాల్గొన్నారు.

అదనపు సీడీపీవోగా శాంతలక్ష్మి

విశాలాంధ్ర-గుడిబండ: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓగా జి.శాంతలక్ష్మి నియమితులయ్యారు. పెనుకొండ ప్రాజెక్ట్ సీడీపీవోగా విధులు నిర్వ హిస్తూ సోమవారం గుడిబండ అదనపు సీడీపీఓగా భాద్యతలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్ట్ గుడిబండ. అమరాపురం మండలాలలోని అంగనవాడీ కార్యకర్తలు ఆయాలు ప్రీస్కూల్ నడపడంలో సమయపాలన పాటించి, అందరూ సహకరించి, సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కమలమ్మ, అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు తదితరులు సీడీపీఓ శాంతలక్ష్మికి స్వాగతం పలికారు.

మహా గణి మొక్కను నాటిన న్యాయవాదులు, జర్నలిస్టులు

విశాలాంధ్ర - హిందూపురం: హిందూపురం ప్రెస్ క్లబ్ నందు జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం సీనియర్ న్యాయవాదులు రామచంద్రా రెడ్డి, ఇందాద్, శివ శంకర్, వన్నూరప్పల సమక్షంలో నిర్వహించారు. వినాయక చవితి శుభ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆవరణములో మహాగని చెట్టును సీనియర్ న్యాయవాదులు, జర్నలిస్టులు నాటూరు. న్యాయవాదులు మాట్లాడుతూ, నూతన కమిటీకి శుభాకాంక్షలుతెలియజేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రెస్ క్లబ్ భవన అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, పాత్రికేయులకు లీగల్‌గా ఎలాంటి సమస్యలు వచ్చినా, మీకు అండగా ఉండి సమస్యలను న్యాయపరంగా పోరాడుతామన్నారు. న్యాయవాదులకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పెనుకొండ: సబ్సిడీ ఉలవ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి చందన తెలిపారు. ఖరీఫ్ 2024కు సంబంధించి వర్షాభావ పరిస్థితుల వలన ఇప్పటి వరకు పంట సాగు చేయని రైతులకు 80శాతం రాయితీతో ఉలవ విత్తనాలను రైతు సేవ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు స్థానిక మండల వ్యవసాయ అధికారిణి తెలిపారు. రైతులు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి, తాము సాగు చేసిన పంటను నమోదు చేసుకోవాలన్నారు. రాయితీ ఉలవ విత్తనములు అవసరమున్న రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర-నల్లమాడ: మండలంలోని రాగానిపల్లి, చౌటకుంటపల్లి, గోపేపల్లి, నల్లమాడ తదితర గ్రామాల్లో సోమవారం ఆయా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వినాయకుని నిమిజ్జనం ఘనంగా నిర్వహించారు. మేళాలతో విగ్రహాన్ని ఊరేగిస్తూ ఆ ప్రాంతంలోని బోరు బావి, నీటి కుంటలో నిమిజ్జం చేశారు. రాగానిపల్లి గ్రామంలో వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 15 కేజీల లడ్డు అదే గ్రామానికి చెందిన ఎం ఆదినారాయణ రూ.1,81,500లు వేలం పాట పాడినట్లు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రూ.1.50 లక్షలు వరద బాధితులకు అందించిన మహిళా సమాఖ్య సభ్యులు

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం పట్టణం మెప్మా విభాగానికి చెందిన తెలుగు తల్లి పట్టణ సమాఖ్య, భరతమాత పట్టణ సమాఖ్య సభ్యులు వారి సొంతంగా కూడబెట్టుకున్న మొత్తంలో రూ.1.50 లక్షలు జమ చేసి ఆ చెక్కును స్థానిక నాయకుల ద్వారా, ఆ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంటు జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ బల రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు డీఈ రమేష్ కుమార్, తదితరులు మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు స్వతహాగా పొదుపు మొత్తం జమ చేసి వాటి ద్వారా రుణాలు పొంది ఆర్థిక చైతన్యంతో వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి పరిమళ, వెంకటలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, పట్టణ సమాఖ్య సంఘాల ప్రతినిధులు మల్లికా భాను, కవిత, నాయకులు షఫీ, బాబు, వెంకటేష్, కొట్నూర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పలు వినాయక నిమజ్జన ప్రదేశాలను జిల్లా ఎస్పీ రత్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని చెరువులో వినాయక నిమజ్జన వేడుకలను వారు పర్యవేక్షించారు. చెరువులో క్రేన్ల సహాయంతో వినాయక విగ్రహాలు చేస్తుండగా గట్టి పోలీస్ బందోబస్తును వారు ఏర్పాటు చేయించారు. ఎక్కడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రాణ నష్టం జరగకుండా ప్రత్యేక నిఘాను పోలీసులు ఉండాలని సూచించారు. పిల్లలు, తల్లిదండ్రులు, ఈతరాణి నిర్వాహకులు చెరువులోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. వినాయక పండుగ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని వన్ టౌన్, టూ టౌన్, రూరల్ సిఐలను ఎస్ఐలను ఆదేశించారు. వీరి వెంట వన్ టౌన్, టూ టౌన్, రూరల్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏ గర్భిణీ జన్మనిస్తూ మృతి చెందకూడదు

విశాలాంధ్ర - ఓబుళ దేవర చెరువు: గర్భం ధరించిన ప్రతి మహిళ హైరిస్క్ కారకాలతో మృతి చెందరాదని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం ధరించిన ప్రతి మహిళ హైరిస్ కారణాలతో మృతి చెందకూడదన్నారు. వయస్సు, ఎత్తు, బరువు, కుటుంబ ఆరోగ్య పూర్వ చరిత్ర అలాగే సాంకేతిక పరిశోధక అంశాలైన బీపీ, షుగరు, రక్తహీనత, హెచ్‌ఐవీ, హెపటైటీస్ బీ, థైరాయిడ్ తదితర అంశాలపచ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాహార పదార్థాలు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 29 మంది హాజరుకాగా 15 మందిని హై రిస్క్‌గా గుర్తించి, ప్రత్యేక చికిత్సలు చేసామన్నారు. ఏడుగురుకి ఉచిత స్కానింగ్‌లు చేసి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన గర్భవతులు, సహాయకులకు కదిరి రోటరీ క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సుభాషిని, దిల్షాద్, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రూ.101 లకే వరించిన వినాయకుని లడ్డు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలం కేంద్రంలోని సాయి నగర్, సాయి స్కూల్ సమీపాన వినాయకుని మండపం నందు 5 కేజీల లడ్డును టోకెన్ల ప్రకారం ఒక టోకెన్ రూ.101 ప్రకారం పంపిణీ చేశారు. అందులో, విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న రవి ఒకటోకను కొనుగోలు చేశారు. టోకన్లో లాటరీ తీయగా అతని పేరిట వినాయక లడ్డు అదృష్టం వరించింది. ఈ సందర్భంగా వారి, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నిమజ్జనాలను ప్రారంభించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పెనుకొండ : పట్టణంలో వివిధ కాలనీలో వెలసిన గణేష్ విగ్రహాలను సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ, ఈడబ్ల్యుఎస్, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ తరుపున పర్యటించడం జరిగింది. పెనుకొండ పట్టణంలోని న్యూ కాలనీ, నారాయణమ్మ కాలనీ, ఆల్విన్ కాలనీ, బీఐసీ కాలనీ, ఎగువ గడ్డ, పాత పోస్ట్ ఆఫీస్ రోడ్, చెరువు రోడ్, తోటగేరి, మారుతి నగర్, బీటీఆర్ కాలనీ, కొత్తపేట తదితర వివిధ వీధుల్లో గణేష్ విగ్రహాలను సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొని నిమజ్జనాలకు వినాయక విగ్రహాలను ప్రారంభించిన మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు ఆయనతోపాటుగా టీడీపీ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, టీడీపీ నాయకులు త్రివేంద్ర, వడ్డిచంద్ర, నరసింహారెడ్డి, షమీ, షౌకత్, కటికర కన్నా, బాబిరెడ్డి, అరుణ్ రెడ్డి, మాధవరెడ్డి, మణి, రాజేంద్ర, కురుబ నంజుండ, అంజనరెడ్డి తోటగిరి గోపి మారుతి నగర్ లక్ష్మీదేవి, బీటీఆర్ కాలనీ చెనరాయుడు, సోము కుమారమ్మ, సాయి రమేష్, బీజేపీ నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, జయరాం యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పిస్తాం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా అధికారులనుఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆమడగూర్ మండలంలో కససముద్రంలో గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేయుచున్న ప్రభాకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, మెదడు జబ్బుతో బాధపడుతూ ప్రస్తుతం కోమాలో ఉన్నాడు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో తీసుకుకొచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ స్వయంగా అతనిని పరిశీలించారు. అతనికి ఒక కుమార్తె, ఒక బాబు చిన్న పిల్లలగా ఉన్నారు. వారి భార్య భాగ్యమ్మకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. కమిటీ సభ్యుల ఆమోదంతో ఆమెకు త్వరలో ఉద్యోగ భద్రత కల్పించడం జరుగుతుందని, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శుభ దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మంజువాణి, డీసీహెచ్‌వో తిపేంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న పలువురు

విశాలాంధ్ర-ధర్మవరం: గత కొన్ని రోజుల కిందట విజయవాడలో వరదలు రావడంతో విజయవాడ ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతూ తినడానికి తిండి, ఇల్లు లేక పూర్తి కోల్పోవడం జరిగింది. ఈ దిశలో రాష్ట్రంలోని పలువూరు తమవంతుగా సహాయ సహకారాలను అందిస్తూ, దాతృత్వం చాటుకుంటున్నారు. ఇందులో భాగంగానే శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలోని సాయి నగర్‌లో గల స్పందన హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్, భార్య డాక్టర్ సోనియాలు తమవంతుగా రెండు రోజులపాటు విజయవాడకు నేరుగా వెళ్లి తమ దాతృత్వమును చాటుకున్నారు. తొలుత మొదటిరోజు 300 దుప్పట్లను సత్య కుమార్ అందజేశారు. రెండో రోజు గన్నవరంలో మెడికల్ క్యాంపులో భాగంగా రోగులు పడుకోవడానికి కప్పుకోవడానికి 500 బెడ్ షీట్స్, 500 బెడ్ స్ప్రెట్స్‌ను కలెక్టర్ కార్యాలయంలో అత్యవసరంగా వారు అందజేశారు. అనంతరం డాక్టర్ బషీర్ మాట్లాడుతూ ఇలాంటి సమయాల్లో ప్రజలందరూ, వ్యాపారస్తులు, దాతలుగాను సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ కృష్ణ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. ఇటువంటి అవకాశాన్ని మాకు కల్పించిన ప్రభుత్వానికి అధికారులకు డాక్టర్ బషీర్, సోనియాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతుగా జిల్లాలోని ధర్మవరం కళా జ్యోతి సాంస్కృతిక సంస్థ వారు ముఖ్య మంత్రి రిలీజ్ ఫండ్ కొరకు రూ.1,01,116లు విలువచేసే డీడీని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేసినట్లు కళాజ్యోతి అధ్యక్షులు నారాయణ, గౌరవ అధ్యక్షులు వెంకటనారాయణ, కార్యదర్శి బి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు సింగన మల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ కళాజ్యోతి సాంస్కృ తిక సంస్థను అభినందించారు. అనంతరం కళాజ్యోతి అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ విజయవాడలో ఇటీవల జరిగిన వరద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, అన్ని రకాలుగా పూర్తి దశలో నష్టపోయినందున తమ వంతుగా ఆర్థిక సాయం అందించడం తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, గోరకాటి పెద్దారెడ్డి, పల్లెం వేణుగోపాల్, రాంప్రసాద్, సుందరేశం, రమేష్, రామన్న, పోలా వెంకటనారాయణ, మధుసూదన్, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 10, సెప్టెంబరు 2024

పల్లె వెలుగు బస్సులు నడపండి..

ప్రజల ఇబ్బందులను ఆర్టీసీ అధికారులు గుర్తించాలి

విశాలాంధ్ర-శింగనమల: అనంతపురం నుండి తాడిపత్రి, తాడిపత్రి నుండి అనంతపురంకు పల్లె వెలుగు బస్సులు నడపాలని, శింగనమల నియోజక వర్గం ప్రజలు వేడుకుంటున్నారు. అనంతపురం నుండి తాడిపత్రి మార్గంలో పల్లె వెలుగు బస్సులు నడపక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనంతపురం నుండి తాడిపత్రి వరకు అనేక గ్రామాలు ఉన్నాయి. దిగవలసిన స్టేజీలో దిగాలంటే తాడిపత్రిలో ఎక్కితే అనంతపురం టికెట్ అనంతపురంలో ఎక్కితే తాడిపత్రి టికెట్ తీసుకోవాల్సిందే. అనంతపురం నుండి తాడిపత్రి వరకు వయా శింగనమల మార్గంలో ఇంతవరకు ఒక పల్లె వెలుగు బస్సు చిరునామా లేకుండా పోయింది. అనంతపురం నుండి తాడిపత్రి మార్గంలో పల్లె వెలుగుబస్సులు నడిపేందుకు, వేయించేందుకు ఏ అధికారి, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు అనంతపురం జిల్లా కేంద్రం నుండి అన్ని వైపులా పల్లె వెలుగు బస్సులు నియోజక వర్గ కేంద్రాలకు నడుపుతున్నారు. కానీ అనంతపురం నుండి తాడిపత్రికి పల్లె వెలుగు బస్సులు నడపడానికి ఏమి ఇబ్బందులు ఉన్నాయో తెలియడం లేదన్నారు. అనంతపురం నుండి తాడిపత్రి వైపు ఒక్కటంటే ఒక్కటి పల్లె వెలుగు బస్సు లేదని, దీనివల్ల ఈ రెండు పట్టణాల మధ్యన ఉన్న పల్లె ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్స్ప్రెస్ బస్సులను ఎక్కాల్సి వస్తుందన్నారు. అనంతపురం, బుక్కరాయ సముద్రం, పీపీ కాలనీ,ఓపెన్ ఎయిర్ జైలు, రెడ్డిపల్లి, రోటరీపురం, కొర్రపాడు, శింగనమల క్రాస్, శివపురం, బండమీద పల్లి, చక్రాయపేట, పోతురాజు కాలువ, పెరవలి, నాయన పల్లి క్రాస్,నాయన పల్లి, వెంకటం పల్లి క్రాస్, మద్దలపల్లి, ముచ్చుకోట, ఏ. కొండాపురం, ఎర్రగుంటపల్లి, రావివెంకటం పల్లి తాడిపత్రి వరకు పల్లె ప్రజలు ఎక్స్ప్రెస్ బస్సులలో ప్రయాణం చేయాల్సి వస్తోందని, అందువల్ల మేము నష్టపోవాల్సి వస్తోందని, దీనివల్ల సకాలంలో బస్సులు రాక వ్యయ, ప్రయాసలతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని, పాలకులు, అధికారులు మారుతున్నారే గాని పల్లె ప్రజల తల రాతలు మారలేదని, శింగనమల నియోజకవర్గం తాడిపత్రి నియోజకవర్గం లోని మూడు గ్రామాలకు , పల్లె వెలుగు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అనంతపురం నుండి తాడిపత్రి వరకు ప్రజల సౌకర్యార్థం పల్లె వెలుగు బస్సులు నడపాలని,ప్రజల విన్నపాన్ని ఆలకించి అనంతపురం, తాడిపత్రి, డిపోల ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్పందించి అనంతపురం తాడిపత్రి. తాడిపత్రి నుండి అనంతపురం వైపు పల్లె వెలుగు బస్సులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, శింగనమల నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

గణేష్ నిమజ్జనానికి పోలీసుల పటిష్ట చర్యలు

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో పకడ్బందీ చర్యలు

విశాలాంధ్ర-అనంతపురం : అనంతపురం నగరంలో 11వ తేదీ జరుగబోవు వినాయక నిమజ్జనోత్సవం గురించి గణేష్ విగ్రహ మంటపాల నిర్వాహకులకు మరియు నగర ప్రజలకు పోలీసు వారి సూచనలు చేశారు.

గణేష్ విగ్రహాలు ఊరేగింపుగా తీసుకెళ్లడానికి రూట్ మ్యాప్... సప్తగిరి సర్కిల్ - రాజీవ్ రోడ్డు - శ్రీకంఠం సర్కిల్ - తిలక్ రోడ్డు - తాడిపత్రి బస్ స్టాండ్ - గాంధీబజార్ - బసవన్న కట్ట - సూర్యనగర్ సర్కిల్ - సప్తగిరి సర్కిల్ - టవర్ క్లాక్ - పిటిసి - నడిమివంక - కళ్యాణదుర్గం బైపాస్ (10 అడుగుల కంటే ఎత్తైన విగ్రహాలు పంపనూరు కెనాల్ వద్ద నిమజ్జనం చేయాలి) - బళ్ళారి బైపాస్ (10 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు రాచానపల్లి వంక వాడ నిమజ్జనం చేయాలి) గణేష్ విగ్రహ మంటపాల నిర్వాహకులకు పోలీసు వారి సూచనలు చేయడం జరిగింది. 11 న మధ్యాహ్నం 3 గంటలకు గణేష్ విగ్రహాలు ఊరేగింపును ప్రారంభించాలి అన్నారు. 10 అడుగుల కంటే తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను అనంతపురము రూరల్ మండలంలోని రాచానపల్లిలో నిమజ్జనం చేయాలన్నారు. 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను పంపనూరు కెనాల్ లో నిమజ్జనం చేయాలి, నిర్వాహకులు విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయవలెనో పోలీసు వారు ముందే తెలియజేస్తారు. నిర్దేశించిన ప్రదేశములోనే వారి విగ్రహాలను నిమజ్జనం చేయాలి, ఎత్తైన విగ్రహాలను నిమజ్జనానికి తీసుకుని వెళ్లడానికి రుద్రంపేట బైపాస్, బళ్ళారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్ వద్ద ఉన్న నేషనల్ హైవే బ్రిడ్జ్ ఆటంకము కలుగును. అటువంటి ఎత్తైన విగ్రహాలను, నిర్వాహకులు తపోవనం సర్కిల్ మీదుగా సర్వీసు రోడ్డులో విగ్రహాలను తీసుకునివెళ్ళి కళ్యాణదుర్గం రోడ్డుకు వెళ్లాలని తెలిపారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా, ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పోలీసు వారికి సహకరించి ఉత్సవాలను ఘనంగా, ఆహ్లాదకరంగా నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ మరియు విగ్రహ మంటపాల నిర్వాహకులకు పోలీసుల విజ్ఞప్తి చేశారు. కార్లు, లారీలు, ఆర్టిసి బస్సులు, ప్రయివేటు బస్సులు మరియు ఇతర భారీ వాహనాలు కింద తెలిపిన ప్రదేశాల గుండా వెళ్ళుట నిషేధం అన్నారు. తపోవనం సర్కిల్,రవి పెట్రోల్ బంక్ ,రాజహంస అపార్ట్మెంట్ (సాక్షి ఆఫీసు), పంగల్ రోడ్డు , కలెక్టరేట్ టు, భాస్కర్ పెట్రోల్ బంక్మీదాపెట్రోల్ బంక్,మిర్చి యార్డు, తడకలేరు. అనంతపురము నగరములో జరుగబోవు వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా నగరములో మరియు నిమజ్జన ప్రదేశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిమిత్తం సుమారు 500 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు.

బీజేపీతోనే రైతుల సంక్షేమం..

విశాలాంధ్ర-అగళి: రైతుల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి పిలుపుమేరకు సత్య సాయి జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డరంగేగౌడ అధ్యక్షతన అగళిలోని రామాపురం గ్రామంలో విక్టోరియా రాణి ఇంటి అవరణంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అగళి మండలంలోని రామాపురం రైతులతో కలిసి సభ్యత్వ నమోదును అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో రైతులు బాగుండాలంటే బీజేపీ బలపరిచి సభ్యత్వం నమోదు చేయాలని కోరారు. వారు సానుకూలతతో పలువురు రైతులకు సభ్యత్వం నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విక్టోరియా రాణి, కిసాన్ మోర్చా అసెంబ్లీ ఇన్చార్జ్ డాక్టర్ కేఆర్పీ గుప్తా, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రంగయ్య గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు నారాయణప్ప, కిసాన్ మోర్చా ఆగలి మండల అధ్యక్షులు రవీంద్ర, మంజు, మంజునాథ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వార్షిక మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: 17వ వార్షిక మహాసభలు ఈనెల 14, 15 తేదీల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ కార్యదర్శి మురళీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్ లు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమైక్యాంధ్ర భవన్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞాన ప్రచార సంస్థగా ఆరోగ్య, విద్యా రంగాల్లో 35 ఏళ్లుగా ప్రచారం చేస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రజల సామాజిక జీవితంలో అత్యంత ప్రభావాన్ని చూస్తున్న సంస్థగా వెలుగునిందని తెలిపారు. ఒక పౌర సంస్థగా సాక్షరతా ఉద్యమం, వైజ్ఞానిక కళాయాత్రలు, సారా వ్యతిరేక ఉద్యమం, చెకుముకి సైన్స్ సంబరాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, పోరాటాలు, ఉపాధ్యాయ శిక్షణలు, మహిళా సాధికార పోరాటాలు నిర్వహించిన సంస్థగా జన విజ్ఞాన వేదికకు గుర్తింపు ఉందని గుర్తు చేశారు. ప్రజల సహకారంతో నిర్వహించిన ఉద్యమాలు పోరాటాలు యువతను, ప్రజా శాస్త్రీయ ఉద్యమాలకు దగ్గరగా చేర్చేందుకు స్ఫూర్తి నింపేందుకు ఈ మహా సభలు ఉపయోగపడతాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 400 మంది ప్రతినిధులు హాజరు అవుతారని చెప్పారు . జి ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగే ఈ మహాసభలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఎస్కే శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, మానవ హక్కుల సంఘం నేత చంద్రశేఖర్, ప్రఖ్యాత సైంటిస్ట్ సవ్యసాచి ముఖర్జీ ,ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బ్రహ్మారెడ్డి, తదితరులు హాజరవుతారని తెలిపారు. యువత, విద్యార్థులు, మేధావులు, భారీ సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఈరన్న, కార్యదర్శి జగదీష్, యువత కన్వీనర్ రాఘవేంద్ర ,అధ్యక్షుడు మంతేష్ తదితరులు హాజరయ్యారు.

వైభవంగా వినాయక నిమజ్జనం..

దేవగిరి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

విశాలాంధ్ర-బొమ్మనహళ్: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనం వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలోని ఉద్దేహాల్, గోవిందవాడ, దేవగిరి, శ్రీధరఘట్ట, ఎల్బీనగర్ తదితర గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమం జరిగింది. భారీ ఊరేగింపులతో వినాయకుని ఊరేగించి హెచ్ఎల్సీ కాలువలో నిమజ్జనం చేశారు. దేవగిరి గ్రామంలో జరిగిన గ్రీన్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నిమజ్జనం వేడుకలు కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కేశవరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జెడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ నాయకులు కాంతారావు, అప్పారావు, గ్యాస్ గోవిందు, ఆంజనేయులు, తిమ్మరాజు, పయ్యావుల నాగరాజు, పల్లి తిప్పేస్వామి, సోమనాథ్ గౌడ్, పయ్యావుల అనిల్ పయ్యావుల మోహన్, నవీన్, సొల్లపురం బాబు, సంగప్ప, కృష్ణాపురం సీన, గాలి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్లలోని మాధవరాయ దేవస్థానం ఎదురుగా ఫ్రెండ్లీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడు రోజుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వంహిచారు. గోరంట్ల సీఐ బి.శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పూజ కార్య క్రమాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

గోరంట్లలో ఘనంగా గణేశుని నిమజ్జనం

విశాలాంధ్ర-గోరంట్ల: వినాయక చవితి పండుగ సందర్భంగా మూడో రోజు అయిన సోమవారం గణేష్ విగ్రహాలు నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడి విగ్రహాలను ప్రత్యేక వాహనాలలో ఏర్పాటు చేసుకొని పిల్లలు యువకులు రంగులు చల్లుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. సీఐ బోయ శేఖర్ బూదిలి రోడ్డులోని ఎర్ర చెరువులో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేయించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ చౌడేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం వేసి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

గణేష్ నిమజ్జనాలను ప్రారంభించిన టీడీపీ నాయకులు ..

విశాలాంధ్ర-పెనుకొండ : పట్టణంలోని న్యూ కాలనీ, నారాయణమ్మ కాలనీ, ఆల్విన్ కాలనీ, బీఐసీ కాలనీ, ఎగువ గడ్డ, పాత పోస్ట్ ఆఫీస్ రోడ్, చెరువు రోడ్, తోటగేరి, మారుతి నగర్, బీటీఆర్ కాలనీ, కొత్తపేట తదితర వివిధ వీధుల్లో గణేష్ విగ్రహాలను మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు సందర్శించి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. టీడీ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, టీడీపీ నాయకులు త్రివేంద్ర, వడ్డిచంద్ర, నరసింహారెడ్డి, షమీ, షౌకత్, కటికర కన్నా, బాబిరెడ్డి, అరుణ్ రెడ్డి, మాధవరెడ్డి, మణి, రాజేంద్ర, కురుబ నంజుండ, అంజనరెడ్డి తోటగిరి గోపి మారుతి నగర్ లక్ష్మీదేవి, బీటీఆర్ కాలనీ చెనరాయుడు, సోము కుమారమ్మ, సాయి రమేష్, బీజేపీ నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, జయరాం యాదవ్, వీహెచ్పీ నాయకులు వేదవ్యాస్ తదితర నాయకులు కార్యకర్తలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రోళ్ల మండలంలో..

విశాలాంధ్ర-రోళ్ల: మండల పరిధిలోని అవినకుంట, బీజీ హళ్లి, డీటీ హళ్లి గ్రామల్లో కొలువుదీరిన వినాయకునికి సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. భక్తులు వివిధ రకాల తినుబండారాలు గణేశునికి నైవేద్యంగా సమర్పించి మూడు రోజులు విశేష పూజ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిమజ్జనానికి గ్రామాల పురవీధుల గుండా డబ్బు వాయిద్యాలతో ఉత్సాహంగా సాగుతూ వైభవంగా గణనాథున్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిమజ్జన కార్యక్రమాలకు బయలుదేరిన గణపయ్యలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలో ప్రజలందరూ వినాయక పండుగను అంగరంగ వైభవంగా అంబరాన్నంటే విధంగా వినాయక విగ్రహాలకు మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు చేసి గణేష్ నిమజ్జన కార్యక్రమానికి పాతూరు చెరువు దగ్గరికి వెళ్లి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. సీఐ యతేంద్ర ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందిని నియమించి, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిపించారు.

నల్లమాల మండలంలో..

విశాలాంధ్ర-నల్లమాడ: మండలంలోని రాగానిపల్లి, చౌటకుంటపల్లి, గోపేపల్లి, నల్లమాడ తదితర గ్రామాల్లో సోమవారం ఆయా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. తప్పెట మేళాలతో విగ్రహాన్ని ఊరేగిస్తూ ఆ ప్రాంతంలోని బోరు బావి, నీటి కుంటలో నిమజ్జం చేశారు. రాగానిపల్లి గ్రామంలో వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 15 కేజీల లడ్డు అదే గ్రామానికి చెందిన ఎం ఆదినారాయణ రూ.1,81,500లు వేలం పాట పాడినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లాలోని అన్ని పీహెచ్సీలు, సీహెచ్పీలు, యూపీహెచ్పీలు, ఏరియా ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని పీహెచ్సీలు, సీహెచ్పీలు, యూపీహెచ్పీలు, ఏరియా ఆసుపత్రులు, జీజీహెచ్లో మౌలిక సదుపాయాల కల్పనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పీహెచ్సీలు, సీహెచ్పీలు, యూపీహెచ్పీలు, ఏరియా ఆసుపత్రులు, జీజీహెచ్లో మౌలిక సదు పాయాల కల్పన కోసం వచ్చే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ 3 నెలలకు సంబంధించి కార్యచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. అన్నింటికీ ఎన్కోర్ సర్టిఫికేషన్ వచ్చేలా సదుపాయాల కల్పన పూర్తి చేయాలన్నారు. అన్నిచోట్ల ప్రత్యేక దృష్టి సారించి అన్ని రకాల సదుపాయాల కల్పన కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావే శంలో డీఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డీసీహెచ్ఎస్ పాల్ డా.రవికుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర రావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.మాణిక్య రావు, ఆర్అండ్బీ ఎస్ఈ ఓబుల్ రెడ్డి, వైద్యశాఖ క్వాలిటీ మేనేజర్ స్టీఫెన్, ఎమ్మెస్ఐడీసీ ఈఈ చంద్రశేఖర్రెడ్డి, ఏఈ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు ఆరోగ్య అంశాలపై అవగాహన

విశాలాంధ్ర-ఉరవకొండ: రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యాధికారి వెంకటేశ్ నాయక్ పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా భృణ హత్యల నివారణ చర్యలు గురించి, పీసీపీఎన్డీటీ చట్టం గురించి వివరించారు. ఎవరైనా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఆడ శిశువగ గుర్తించి భృణ హత్యలకు పాల్పడినచో వారికి జరిమానా, జైలుశిక్ష తప్పవని హెచ్చరించారు.

పౌష్టిక ఆహారంపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: పౌష్టిక ఆహారంపై గర్భవతులు బాలింతలు అవగాహన కలిగి ఉండాలని వజ్ర కరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సర్దార్ వలి అన్నారు. సోమవారం తట్రకల్లు, గంజిగుంట గ్రామాలలో బాలింతలకు, గర్భవతులకు పౌష్టిక ఆహారం పై అవగాహన కల్పించారు. పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మనం తీసుసునే ఆహారం మీద ఆధారపడి ఉంటుందని, ఆహారంలో అన్ని పోషక పదార్థాలు సరైన మోతాదుల్లో ఉండే ఆహారాన్ని పోషకాహారం అంటారని తెలిపారు. సాధారణంగా వ్యక్తి శారీరక, మానసిక పెరుగుదల సక్రమంగా ఉండాలంటే ఆహారం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో 104 డీహో నటరాజ్ గౌడ్, హెల్త్ అసిస్టెంట్ రమేష్ బాబు, ఏఎన్ఎం జ్యోతి, వరలక్ష్మి, వీరితో పాటు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు బాలింతలు పాల్గొన్నారు.

నిమజ్జనంలో తగిన జాగ్రత్తలు తీసుకోండి

విశాలాంధ్ర-శింగనమల: గణేష్ నిమజ్జనంలో అపశృతులు దొర్లకుండా గణేష్ మండపం కమిటీ వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శింగనమల సీఐ కౌలుట్లయ్య సూచించారు. గణేష్ ప్రతిమలను చెరువునీటిలో నిమజ్జనం చేయడాన్ని పర్యవేక్షించడంతో పాటు స్వయంగా ఆయన నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఎస్సైలకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం ప్రాంతాలలో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన ప్రక్రియకు ఎలాంటి ఆటంకం లేకుండా తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు.

ఆటోమోటివ్ స్కిల్స్ డెవలప్మెంట్ కౌన్సిల్తో మిట్స్ ఒప్పందం

విశాలాంధ్ర-జేఎన్టీయూపీ: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్తో ఆటోమోటివ్ స్కిల్స్ డెవలప్మెంట్ కౌన్సిల్, న్యూ ఢిల్లీ అవగాహన ఒప్పందం కుదుర్చుకునట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువ రాజ్ తెలిపారు. దీంతో కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు ఆటోమోటివ్ రంగంలో నైపుణ్యం పెంపొందిచడానికి ఓ మంచి అవకాశమన్నారు. విద్యార్థులకు సర్టిఫికేషన్ కోర్సులకు యాక్సెస్తో సహా అనేక రకాల శిక్షణలు ఇస్తున్నాయన్నారు. దేశం అంతటా ఆటోమోటివ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వాలు ఎంతో అన్నారు. కార్యక్రమంలో అరిందమ్ లాహిరి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,ఆటోమోటివ్ స్కిల్స్ డెవలప్మెంట్ కౌన్సిల్ కళాశాల గవర్నింగ్ బాడీ మెంబెర్ టీజీ రవికుమార్ పాల్గొన్నారు.

పాలసముద్రంలో పేదల నివాసం ఉన్న స్థలాలకు హక్కులు కల్పించాలి

18వ తేదీన పేదలతో ఆర్డీఓని కలుస్తాం
సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని పాలసముద్రం గ్రామంలో ఇళ్లలేని పేదలు నివాసం ఉన్న స్థలాలకు హక్కుల కల్పించి న్యాయం చేయాలని వ్యక్తిగత అర్జీలతో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య అధ్యక్షతన మండల తహసిల్దార్ వారికి రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ ఇల్లు లేని పేదలు గత 2 సంవత్సరాల క్రితం నివాసం ఉన్న స్థలాలకు హక్కులు కల్పించాలని నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం కింద దరఖాస్తు చేసుకున్నారన్నారు, ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 125 నందు నివాసం ఉన్నారు. వీరందరూ దళితులు బడుగు బలహీన వర్గాల పేదలు రోజువారి కూలి పనులు చేసుకుని వేలాది రూపాయలతో ఇల్లు కట్టుకొని నివాసం ఉన్నారు. దరఖాస్తుల విచారణ మరియు తదుపరి చర్యలకు అధికారులు స్పందించకపోవడంతో పేదలందరూ హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు 2 నెలల లోపల అన్ని రకాల చర్యలు తీసుకొని పట్టాలు ఇవ్వాలని డబ్ల్యూపీ నెంబర్ 13659/2024 ఉత్తర్వులు ద్వారా ఆదేశించిందన్నారు. అయితే అధికారుల విచారణ తప్పని , క్షేత్ర స్థాయి విచారణ చేయలేదని తెలిపారు, పాలసముద్రం గ్రామంలో 1979 లో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల తప్ప ఇప్పటి వరకు ఒక్కరికి స్థలాలు ఇవ్వలేదని , ఒక్కొక్క ఇంటిలో 2 , 3 కుటుంబాలు నివాసం ఉన్నాయని , ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుండి వచ్చిన పేదలు ఉన్నారని చెప్పారు, ఈ విషయాన్ని తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా తహసిల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్లో పై విషయాలను వివరించడం జరిగింది. తహసిల్దార్ రెడ్డి శేఖర్ ఫోన్లో మాట్లాడుతూ కచ్చితంగా క్షేత్రస్థాయి విచారణ జరిపి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, నార్సింపల్లి ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, ఇండ్ల స్థలాల సాధన పోరాట కమిటీ కార్యదర్శి అంజనా దేవి, కమిటీ సభ్యులు ముత్యాలప్ప, షాతాజ్, నంజుండప్ప, పేదలు ప్రదీప్, రామంజినమ్మ, లక్ష్మి దేవి , గంగమ్మ, శోభ పాల్గొన్నారు.